క్లుప్తంగా

శ్రీవారి సేవలో గురుమూర్తి


ఆలయం వెలుపల ఎంపీ గురుమూర్తి

తిరుమల: తిరుపతి ఎంపీ గురుమూర్తి తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితుల వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం వీఐపీ విరామ సమయంలో నటుడు రాజేంద్రప్రసాద్ స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రిన్స్‌పల్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ వ్యర్థాలు, తోట వ్యర్థాల ను కంపోస్టు చేసే విధానంపై అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలీల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. కళాశాల లో గార్డన్ వేస్టును ఎలా కంపోస్టు చేస్తున్నది వివరించారు. ఏడీఏలు రమేష్‌రెడ్డి, భాస్కర య్య, ప్రకృతి వ్యవసాయ నిపుణులు కన్నయ్యనాయుడు, గంగాధరం, పురపాలక సంఘ ఏఈ సింధు, అధ్యాపకులు, రైతులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో మంగళవారం స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. స్టెప్స్ సంస్థ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు సంబంధం శెట్టి, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చండి


మునిరాజాను పాఠశాలకు తీసుకొస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన నీర్పాకోట యానాది కాలనీలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న మునిరాజా ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి స్థానిక పాఠశాలలో చేర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయురాలు మీర్జాన్‌బీ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వెంకటముని, వీరరాఘవరెడ్డి, శివయ్య, గోపి, నాగూరయ్య, ఆర్ముగం, వెంకటేష్, మహేష్, భాస్కర్, వాణెమ్మ, భానమ్మ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

ఏర్పేడు: మద్యం మత్తులో ఓ మహిళపై దాడి చేసిన ఘటనలో మండలంలోని పంగూరుకు చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మండలంలోని పంగూరు ఎస్సీ కాలనీకి చెందిన ఆదిలక్ష్మిపై అదే కాలనీకి చెందిన యుగంధర్ మద్యం మత్తులో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.




ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇందిరానగర్ రైతు సేవా కేంద్రం, చిన్న పాండూరులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రైతు సేవా కేంద్రం, స్పందనలో వరదయ్యపాళెం ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న ఇందిరానగర్ స్థానికులు

టెంకాయ కొట్టేదెప్పుడో?

- పూర్తయినా ప్రారంభం కాని ఇందిరానగర్ గ్రామ సచివాలయ భవనం
- వృథాగా రూ.65 లక్షల భవంతులు
- మండలంలో పలుచోట్ల ఇదే పరిస్థితి


ప్రారంభానికి నోచుకోని ఇందిరానగర్ గ్రామ సచివాలయ నూతన భవనం

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో గత ప్రభుత్వంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికల ముందు ప్రారంభిస్తారని హడావుడి చేసినప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. సచివాలయం భవనం రూ.40లక్షలతో, రైతు సేవా కేంద్రం రూ.25లక్షలతో నిర్మించారు. ఈ రెండు భవనాలకు ప్రహరీ గోడ, కార్యాలయాలకు వెళ్లేందుకు సీసీ రోడ్డు కూడా నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం నుంచి లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించినప్పటికీ అవి ప్రారంభంకాక వాడుకలోకి రాలేదు. ప్రస్తుతం ఇందిరానగర్ సచివాలయ కార్యాలయం నిర్వహణ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతోంది. అక్కడ ఉన్న ఇరుకు గదిలోనే సచివాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా పది మంది అర్జీదారులు కార్యాలయంలోకి వెళ్లినా లోపల నిలబడలేని పరిస్థితి. అయితే అధునాతన హంగులతో నిర్మించిన భవనాలు పాలకుల నిర్లక్ష్యానికి వృథాగా మారుతున్నాయి. పైగా ఈ భవంతుల చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి నూతన భవనాలు కాస్త పాడుబడిన భవనాలుగా దర్శనమిస్తున్నాయి. ఈ భవనాలు మండల పరిషత్ కార్యాలయాల సముదాయానికి కూతవేటు దూరంలో ఉండడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

మండలంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన కార్యాలయ భవనాలు:

- వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని గ్రామ సచివాలయం – 1 భవనం
- కడూరులో రైతు సేవా కేంద్రం విలేజ్ హెల్త్ సెంటర్
- బత్తలవల్లంలో విలేజ్ హెల్త్ సెంటర్, రైతు సేవా కేంద్రం
- చిన్న పాండూరులో రైతు సేవా కేంద్రం

గ్రీవెన్స్‌లో విన్నవించాం



ఇందిరానగర్ గ్రామ సచివాలయం కోసం నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఈ నెల 12న స్పందనలో విన్నవించాం. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన నియోజకవర్గ ఎమ్మెల్యేకు సైతం సమస్యను తెలియపరిచా. ప్రస్తుతం ఇందిరానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సచివాలయ విధులను నిర్వహిస్తున్నారు. అక్కడ కనీసం సిబ్బంది కూర్చునేందుకు కూడా వీలుకాక ఇబ్బందిపడుతున్నారు. అర్జీదారులు సైతం కార్యాలయంలోనికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టినా కార్యాలయ భవనాన్ని వాడుకలోకి తెస్తే ప్రజలకు ఉపయోగకరం. – త్యాగరాజు, స్థానికుడు, ఇందిరానగర్

అందుబాటులోకి తెస్తాం



మండలంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయ భవనాలను, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను గుర్తిస్తున్నాం. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లకు బిల్లులు అందని కారణంగా భవనాలను అప్పగించేందుకు ముందుకురావడం లేదు. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ప్రజలకు అందుబాటులోని వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం. – ప్రసాద్, ఎంపీడీఓ, వరదయ్యపాళెం

పరిశుభ్రతతోనే దోమల నివారణ


సత్యవేడు అంబేద్కర్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సత్యవేడు: పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది దాసుకుప్పంలో ర్యాలీ, డాక్టర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్, సిబ్బంది దోమకాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని కనుగొన్న శాస్త్రవేత్త రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. డాక్టర్ మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యావంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందవల్ల దోమలు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డాక్టర్ విద్యాసాగర్, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ప్రిన్సిపల్ ప్రసూన, హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం, ఏఎన్‌ఎం రోస్‌లిన్, ఎంఎల్‌హెచ్‌పీ వి.నాగజ్యోతి, స్టాఫ్ నర్సులు భార్గవి, వనజ, పార్వతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వ హాస్టళ్లలో దోమలు చేరకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారిణి మాధవి తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక బీసీ, ఎస్సీ, బాలుర హాస్టళ్లను గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వైద్య సిబ్బందితో కలసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని తెలిపారు. ఎస్సీ హాస్టల్ వార్డన్ సాల్మన్ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాతో అప్రమత్తం

బుచ్చినాయుడుకండ్రిగ: దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఆయన మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపాళెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ఏర్పేడు: విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ గిరిజ అన్నారు. మంగళవారం ఏర్పేడు బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటగది, ఆహార దినుసులు, స్నానాల గది, విద్యార్థులు నిద్రించే గది, మరుగుదొడ్లు, మెనూ పట్టిక, నీటి తొట్టె, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. డాక్టర్ మాట్లాడుతూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డన్ పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ హాస్టల్ వంట గదిని పరిశీలిస్తున్న వైద్యాధికారిణి, కొత్తపాళెంలో విద్యార్థుల ర్యాలీ, ఏర్పేడు: విద్యార్థుల నిద్రించే గదిని పరిశీలిస్తున్న గిరిజ

మృతదేహం అప్పగింత

ఏర్పేడు: మండలంలోని డిక్సన్ కంపెనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రమోద్‌రామ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. ఆదివారం ప్రమోద్‌రామ్ మండలంలోని డిక్సన్ కంపెనీ వద్ద లారీ కింద పడుకుని నిద్రిస్తుండగా తన స్నేహితుడు సంజయ్‌కుమార్ రామ్ మద్యం మత్తులో లారీ నడపడంతో ప్రమాదం జరిగి మృతిచెందాడు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఖాతాలకు కళ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఉద్యోగుల బ్యాంకు ఖాతాలు ఎట్టకేలకు కళకళలాడాయి. గత కొన్ని రోజులుగా ఉద్యోగుల ఖాతాలను స్తంభింపచేసిన ఎస్వీయూ, ఎస్వీబీ అధికారుల వికృత చేష్టలకు మంగళవారం తెరపడింది. జూలై మాసం జీతాలను విడుదల చేసి ఉద్యోగులు, పెన్షనర్ల ఖాతాల్లో జమచేశారు.

నిరసన ర్యాలీ


కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటనలో నిందితులను బహిరంగంగా ఉరితీయాలని నర్సింగ్ విద్యార్థినులు గళమెత్తారు. నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులు, మంగళవారం సాయంత్రం రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ నుంచి నిరసన ర్యాలీ చేశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు కఠినమైన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. – రేణిగుంట

శ్రీసిటీలో 'స్కోర్' పోర్టల్ ప్రారంభం

- పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకారానికి ముందడుగు


స్కోర్ ఆవిష్కరణ కార్యక్రమం

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : శ్రీసిటీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'స్కోర్' (శ్రీసిటీ ఆన్‌లైన్ రిసోర్స్ ఎక్స్ఛేంజ్) వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ సప్‌లై చైన్ ఎగ్జిక్యూటివ్‌ల సమక్షంలో మంగళవారం వర్చువల్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన సస్టైనబులిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్ జి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా.. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ.. స్కోర్ అనేది వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేస్తుందని వివరించారు. మిచిగాన్ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ వ్యర్థాలను తగ్గించడం, అక్కడ అమలుచేస్తున్న సుస్థిర కార్యక్రమాలు, కార్యాచరణ పథకాలపై డాక్టర్ సుధాకర్‌రెడ్డి క్లుప్తంగా ప్రసంగించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పోర్టల్ ప్రాముఖ్యతను వివరించారు.

ఆర్–3 సంస్కృతి సులభతరం..

శ్రీసిటీ జీరో వేస్ట్ ప్రణాళికలో కీలకమైన వ్యర్థాలు, ఉపయోగించని అదనపు పదార్థాల జాబితా తయారీ, మార్పిడికి సమాచార నెట్‌వర్క్‌గా ఈ స్కోర్ పోర్టల్ పనిచేస్తుంది. దీని ద్వారా అనేక కంపెనీలు ఎదుర్కొంటున్న మిగుల పదార్థాల సేకరణ సవాలును పరిష్కరించడంతో పాటు.. పరిశ్రమల్లో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్–3) సంస్కృతిని ప్రోత్సహించడాన్ని సులభతరం చేస్తుంది.

పటిష్టంగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి: పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనని పిండ నిర్ధారణ నిషేధ చట్టాన్ని అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చన్నారు. ఎవరైనా ఈ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మృదుల పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు చర్యలు

శ్రీకాళహస్తి: ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని మండలంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, వార్డు ఎడ్యుకేషనల్ సెక్రటరీలను ఎంఈఓ బాలయ్య ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, పట్టణ, పరిశ్రమల్లో పనిచేస్తున్న 10 ప్లస్ నుంచి 15 ప్లస్ వరకు వయసు కలిగిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 23 చివరి తేదీ అని తెలిపారు. పట్టణ పరిధిలోని మూడు ఓపెన్ స్కూల్స్ ఉన్నట్లు చెప్పారు. ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9490464358, రాజా హైస్కూల్ 9849868934, వాణి విద్యామందిర్ 9394844658 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి సహకరించాలి


విద్యార్థులకు వితరణ వస్తువులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

ఏర్పేడు: దాతలు పేద విద్యార్థుల అభ్యున్నతికి సహకరించాలని మేళ సంస్థ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఏర్పేడు హైస్కూల్‌లో సంస్థ ఆధ్వర్యంలో 45 మంది పేద విద్యార్థులకు గొడుగులు, జామెంట్రీ బాక్సులు, బ్యాగులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి దాతృత్వంతో మెలగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది మంచి ఉద్యోగాలు పొందినట్లు వివరించారు. ఈ ఏడాది పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించాలన్నారు. తమ సంస్థ తరఫున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు శ్రీరాములు, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నా భవనం..నా ఇష్టం


పాఠశాల భవనంలో ద్విచక్ర వాహనాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామపురం (కొమ్మనుగంట)లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కొత్త భవనంలోకి మార్చారు. అయితే ఆ పాత పాఠశాల భవనాన్ని ఆ గ్రామానికి చెందిన ఓ నేత తన సొంత అడ్డాగా మార్చుకుని అంతా నా ఇష్టం అంటూ భవనాన్ని ఇష్టారాజ్యంగా ఉపయోగించుకుంటున్నాడని గ్రామస్తులు అంటున్నారు. అయితే గత ప్రభుత్వంలో కూడా తనే ఈ గ్రామాన్ని శాసించాలనే విధంగా ఆయన ప్రవర్తన ఉండేదని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా తనే గ్రామాన్ని శాసించాలనే విధంగా అతని ప్రవర్తన ఉందని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని ఇప్పటికై నా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఆ పాఠశాల భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీకాళహస్తిలో ఎఫ్–3 సేవలు

- హైప్స్–వి మాల్ అధినేత పెరుమాల్‌రెడ్డి


మాట్లాడుతున్న పెరుమాల్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు హైప్స్–వి మాల్ ద్వారా ఫన్, ఫుడ్, ఫ్యాషన్ (ఎఫ్–3)సేవలు అందజేయున్నామని ప్రముఖ హైప్స్ వి మాల్ అధినేత పుదుకుడి పెరుమాల్‌రెడ్డి తెలిపారు. సిటీ కల్చర్‌ను తలదన్నేలా హైప్స్–వి సేవలు సామాన్యులకు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. స్థానిక హైప్స్ వి మాల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ పేద, మధ్య, ధనిక తరగతి అంతరాలను తగ్గించాలనే ఏకైక లక్ష్యంతో హైప్స్–వి మాల్‌ను శ్రీకాళహస్తిలో స్థాపించినట్లు తెలిపారు. అందులో భాగంగా 22న ఉదయం హాట్ స్పాట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తునట్లు పేర్కొన్నారు. నాణ్యమైన ఫుడ్‌ను తక్కువ ధరలతో ప్రజలకు అందుబాటులో ఉండేలా తీసుకొస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమలు 4–పీ నమూనాతో ముందుకు..


విద్యార్థికి సర్టిఫికెట్లను అందిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి రూరల్: సామాజిక సేవా అభివృద్ధి కార్యాక్రమాల్లో భాగంగా పరిశ్రమలు 4–పీ నమూనాతో ముందుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. శ్రీకాళహస్తి మండలం, రాచగున్నేరి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన వాలిడిక్టోరియస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ లిట్రసీ విభాగాల్లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు, విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం చాలా గొప్పదని కొనియాడారు. యువత భవిష్యత్‌కు బాటలు వేయడానికి స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలు చేపట్టిందని చెప్పారు. పబ్లిక్, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి వారికి వృత్తి శిక్షణ నైపుణ్యతనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గోశాలకు, సోషల్ ఫారెస్ట్ అభివృద్ధి కోసం అవసరమైన బంజరు భూములను పరిశ్రమకు రెవెన్యూ అధికారులు అందజేయాలని ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సురేష్ ఖండేల్‌వాల్, దొరైరాజ్ పాల్గొన్నారు.